క్లుప్తంగా

కానూరులో అన్నసమారాధన



పెనమలూరు: కానూరు సనత్‌నగర్ రామాలయం వద్ద సోమవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా రామాలయం సెంటర్‌లో వినాయకుడి పందిరి వేసి గత కొద్ది రోజులుగా వినాయకుడి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వల్లభనేని మణికంఠ, సైకం చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు

నున్నలో వచ్చే నెలలో స్టేట్ మీట్



విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ అక్టోబర్ నెల 3,4,5 తేదీల్లో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీలకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14,17,19 కేటగిరీలలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి దాదాపు 500 మంది కుస్తీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. గత ఏడాది కూడా రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించింది. నున్న హైస్కూల్ అన్ని విధాలుగా అనుకూలంగా వుండటం అనగా రాష్ట్రం నలుమూలాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి సదుపాయంతో పాటు, భోజనాలను ఏర్పాట్లు, క్రీడాకారులకు పోటీలు నిర్వహించేందుకు అనువైన క్రీడా మైదానం ఉండటం వలన ఈ ఏడాది కూడా రెజ్లింగ్ పోటీలు ఇక్కడే నిర్వహించడానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆసక్తి చూపించింది. ఎన్టీఆర్ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొనేందుకు ముందుగా క్రీడాకారులను ఎంపిక చేస్తారు. క్రీడాకారులు గత కొన్ని రోజులుగా నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. దీంతో హైస్కూల్ ప్రాంగణం క్రీడా వాతావరణం సంతరించుకుని సందడిగా ఉంది.

హాస్టల్ భవనంపై నుంచి దూకిన వ్యక్తికి గాయాలు

కంకిపాడు: కళాశాల హాస్టల్ భవనంపై నుంచి దూకిన వ్యక్తికి గాయాలైన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పరిధిలోని గోసలైట్స్ క్యాంపస్‌లో ఓ యువతి కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు పరిచయం ఉన్న వాసుబాబు అనే వ్యక్తిని పిలిచి మాట్లాడుతుండగా ఆ ప్రాంతానికి వచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ అనుమతులు లేకుండా ఇక్కడకు ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. దాంతో వాసుబాబు కంగారు పడి కళాశాల క్యాంపస్ భవనం మూడో అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు దూకాడు. దీంతో అతను గాయాలపాలయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యత

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సూర్యుడి నుంచి వెలువడే అతి నీలిలోహిత కిరణాల బారిన పడకుండా మనలను ఓజోన్ పొర రక్షిస్తుందని, ఆ ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(హైదరాబాద్) ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయ్‌సింగ్ గౌతమ్ చెప్పారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పీబీ సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహనా సదస్సును సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సోమవారం జరిగింది. ఉదయ్‌సింగ్ గౌతమ్ మాట్లాడుతూ.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించడంతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తులకు దూరంగా ఉండటం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. దీని ద్వారా ఓజోన్ పొర పరిరక్షించబడుతుందని చెప్పారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరానిమెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ అనే అంశంపై పాఠశాల, కళాశాల స్థాయిలోని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. సదస్సు అనంతరం పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. కళాశాల అధ్యాపకులు, నగరంలోని వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకా ముంపులోనే వరి పొలాలు

- విజయవాడ రూరల్ మండలంలో 85 శాతం పొలాల పరిస్థితి ఇంతే...
- ఎకరానికి దాదాపు రూ.25 వేల దాకా పెట్టుబడి
- ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలే ఇస్తాననడం సబబు కాదంటున్న రైతులు
- కౌలురైతుల పరిస్థితి మరీ దయనీయం



కొత్తూరు తాడేపల్లి గ్రామంలో వరద ముంపులో ఉన్న వరి పొలాలు

విజయవాడరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట పొలాలు వరద పాలై విజయవాడ రూరల్ మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో రెండు నెలల్లో చేతికొస్తుందనుకున్న వరిపంట క్షణాల్లో కనుమరుగైందని రైతు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విజయవాడ రూరల్ మండలంలోని 19 గ్రామాల్లో 9,200 ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగు చేశారు. దీనిలో 8,200 ఎకరాల వరి పంట వరదల్లో మునిగిపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. రాయనపాడు, పైడూరుపాడు, గొల్లపూడి, కొత్తూరు తాడేపల్లి, అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో వరి పంట పూర్తిగా మునిగిపోయింది. నున్న, పాతపాడు, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో 60 శాతం పంట నీట మునిగింది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఖరీఫ్ పంట సాగుచేసుకునేందుకు పెట్టుబడి కింద ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదు. దీంతో ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసిన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో బ్యాంకుల్లో రుణం తీసుకుని వ్యవసాయం చేశారు. కొందరైతే బంగారం తనఖా పెట్టి మరీ వరి పంటకు పెట్టుబడులు పెట్టి పండిస్తే ఒక్క బస్తా ధాన్యం కూడా తిరిగి ఇంటికి వచ్చే పరిస్థితి లేదని కన్నీరు మున్నీరు అవుతున్నారు. వేసవి దుక్కులు నుంచి, వరినాట్లు వేసేందుకు, కలుపులు తీయడం, ఎరువులు జల్లడం లాంటి వాటి కోసం ఇప్పటివరకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు పంట పెట్టుబడి పెడితే రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి కేవలం పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తానని సీఎం ప్రకటించడం సబబు కాదని రైతులు వాపోతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



మునిగిన వరిపైరును చేతిలో పట్టుకుని చూపిస్తున్న రైతు

కౌలు రైతులను ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలి. వరదల్లో వరి పంటలు మునిగి పంట చేతికి రాక, పెట్టిన పెట్టుబడులకు బ్యాంకుల్లో తీసుకొన్న రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలి.

–నల్లమోతు చినబాబు, కౌలురైతు, పాతపాడు

కానూరులో ఘనంగా మిలాద్ ఉన్ నబి



కానూరు సనత్‌నగర్‌లో మిలాద్ ఉన్ నబి వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో సోమవారం ఈద్ ఏ మిలాద్ ఉన్ నబి పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో విశిష్ట పండుగగా ఈద్ ఏ మిలాద్ ఉన్ నబి వేడుకలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మక్కా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు ముతావలి షేక్ ఖాదర్ మాట్లాడుతూ ఇస్లాం సందేశం ప్రపంచ శాంతిని, సోదర భావాన్ని పెంపొందిస్తుందన్నారు. ఏ మత గ్రంథంలో కూడా మరో మతాన్ని దూషించమని రాయలేదని, అన్ని మతాల వారు ప్రేమానురాగాలతో ఉండాలనే అన్ని మత గ్రంథాలు చెప్పాయని వివరించారు. కార్యక్రమంలో మత పెద్దలు రహమాన్, పఠాన్ అహ్మద్ ఖాన్, లతీఫ్, యూసూబ్, షేక్ బుజ్జి, అబ్దుల్ వాహెబ్, బాజాని, రియాజ్, ఆసీఫ్ బాషా, షారూఖ్, హమీద్ తదితరులు పాల్గొని మహమ్మద్ ప్రవక్త కీర్తనలతో ప్రార్థనలు చేశారు.

పవన్‌కళ్యాణ్ పాట పెట్టలేదని కత్తితో పొడిచాడు

పెనమలూరు: వినాయకుడి ఊరేగింపులో పవన్‌కళ్యాణ్ పాట పెట్టలేదని కోపంతో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు ఆశ్రమం కాలువ కట్టపై ఎం.నరసింహారావు ఉంటున్నాడు. అతను పోరంకి పచ్చళ్ల కంపెనీలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నరసింహారావు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం రాత్రి నిమజ్జనం సందర్భంగా ఊరేగిస్తూ బయలుదేరారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పెట్టారు. అయితే చరణ్ అనే వ్యక్తి వచ్చి పవన్‌కళ్యాణ్ పాటలు పెట్టాలని నరసింహారావుతో గొడవకు దిగాడు. అయితే అక్కడ ఉన్న మహిళలు బతుకమ్మ పాటలే పెట్టాలని అభ్యంతరం తెలిపారు. దీంతో ఆగ్రహించిన చరణ్ కత్తితో నరసింహారావును వెనుక వైపు పొడిచి పారిపోయాడు. గాయపడిన నరసింహారావును స్థానికులు పోరంకిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

సంప్రదాయ నృత్యాలు ఆదర్శంగా తీసుకోవాలి



పురస్కారాలు అందుకున్న చిన్నారులతో వేముల హజరత్తయ్యగుప్తా, నాట్యాచార్యుడు శ్రీనివాసరావు

విజయవాడ కల్చరల్: భారతీయ సంప్రదాయ నృత్యరీతులను ఆదర్శంగా తీసుకోవాలని న్యాయ వాది వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. నటరాజ నృత్య కళామందిర్ కర్నూలు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కూచిపూడి, ఆంధ్రనాట్యం ప్రదర్శనలు, ప్రతిభ కనపరచిన చిన్నారులకు నృత్య కిశోరం పురస్కారాల కార్యక్రమాన్ని సోమవారం బందరురోడ్డులోని ఏబీవీ జ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన గుప్తా మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం అంశాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. నాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలబాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రముఖ నాట్యాచారిణి పసుమర్తి శ్రీవల్లి మాట్లాడుతూ నృత్యసాధన భగవంతుని సేవలా భావించాలని కోరారు. నగరానికి చెందిన నాట్యాచార్యులు సంతోష్, శోభ అన్నంభొట్ల, యం. ప్రణతి ప్రసంగించారు. నాట్యాచార్యుడు కరీముల్లా ఆధ్వర్యంలో 150 మంది చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన 22 మంది కళాకారులకు నృత్య కిశోరం పురస్కారాలను, చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. నృత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడపాలని, వారంలో ఒక రోజు డ్రైడేని అమలు చేయాలని మద్యం వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి, పి.దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం రాష్ట్రంలో అమలు కానున్న నూతన మద్యం పాలసీ విధానంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటో బహిర్గతం చేయాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం పాలసీలపై అధ్యయనం చేసిన బృందాల నివేదికను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, ప్రముఖుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అక్రమ విక్రయాకాలు సాగుతున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. మద్యం పాలసీని నియంత్రణ దిశగా, నేరాలు అరికట్టే విధంగా, ప్రభుత్వమే విక్రయాలు, షాపులు తగ్గించడం లక్ష్యంగా విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గుడి, బడి, బస్టాండ్‌లు తదితర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న దుకాణాలను రద్దుచేయాలని కోరారు. బెల్ట్ షాపుల అమ్మకాలు నిరోధించాలని, ప్రతి పీహెచ్‌సీలో డీ ఎడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, అధికార యంత్రాంగాన్ని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను మద్య నియంత్రణ లక్ష్యంగా పనిచేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్య వ్యతిరేక పోరాట ఐక్యవేదిక నాయకులు సుంకర పద్మశ్రీ, పి.పద్మ, ఎస్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరద బాధితులకు ఎన్నారై ఆత్మీయ గ్రూప్ సభ్యుడు రమేష్ రామ్‌శెట్టి ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాయకాపురం, శాంతినగర్, వాంబే కాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్‌లోని బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఎన్నారై ఆత్మీయ గ్రూప్ సభ్యుల సహకారంతో నిత్యావసరాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు విజయ్‌రామ్‌శెట్టి, పసుపులేటి వంశీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సాయం

వరదల్లో నష్టపోయిన విశ్వబ్రాహ్మణులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి అన్నారు. సోమవారం రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ముంపునకు గురైన 180 విశ్వబ్రాహ్మణుల కుటుంబాలకు కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున కాకినాడ, పార్వతీపురానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం వారు అందజేశారు.

వరద బాధిత కిట్లలో టీడీపీ నాయకుల చేతి వాటం





టీడీపీ నాయకునికి చెందిన అపార్టుమెంటులో ఉన్న వరద బాధితులకు పంచాల్సిన కిట్లు

విజయవాడరూరల్: అంబాపురం గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు అందజేయమని ఇచ్చిన కిట్లలో ఆ గ్రామ పంచాయతీ పాలక వర్గం అధినాయకుడు, టీడీపీ కీలకనేత చేతి వాటం ప్రదర్శించి కిట్లను దారి మళ్లించాడని బాధితులు ఘొల్లుమంటున్నారు. అనంతపురం జిల్లా శింగనమల టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి, బండారు నారాయణస్వామి చారిటబుల్ ట్రస్టు పేరున బాధితులకు సహాయం అందజేసేందుకు నిత్యావసర సరుకుల కిట్లను అట్టపెట్టెల్లో పెట్టి వెయ్యి కిట్లు తీసుకు వచ్చారు. ఈ నెల 12వ తేదీన పైపులరోడ్డు సమీపంలోని ఒకటవ వార్డు బాధితులకు కేవలం 50 కుటుంబాలకు, మెయిన్ విలేజిలో 40 కుటుంబాలకు నిత్యావసర కిట్లను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అందజేశారు. మిగిలిన నిత్యావసర సరుకుల కిట్లను తర్వాత పంపిణీ చేస్తారని చెప్పి, వాటిని పంచాయతీ పాలకవర్గం అధినాయకుడు తీసుకు వెళ్లారు. అంతే...ఆ కిట్లను అపార్టుమెంటుకు మళ్లించి బాధితుల నోట్లో దుమ్ము కొట్టాడని మహిళలు రోడ్డెక్కి టీడీపీ నాయకులపై తిట్ల పురాణం మొదలెట్టారు. ప్రజాప్రతినిధుల ముసుగులో వున్న స్థానిక పార్టీ నాయకులు వరద బాధిత కుటుంబాలకు అందజేయాల్సిన నిత్యావసర సరకులను ఇంటికి తీసుకెళ్లడం ఏమిటంటూ... ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి, పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెడతామంటున్నారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ



వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న ఎస్సార్కే కళాశాల విద్యార్థులు

రామవరప్పాడు: వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన బాధితులకు విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నగరంలోని వరద ప్రభావ ప్రాంతాల్లో సంచరించి దుస్తులు, కొవ్వొత్తులు, దోమతెరలు, మస్కిటో కాయిల్, మందులతో కూడిన 1000 కిట్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు మాట్లాడుతూ కళాశాల ఆధ్వర్యంలో వరద బాధితులకు కొన్ని రోజులుగా సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలోని క్యాంటీన్‌లో ప్రత్యేకంగా ఆహార పదార్థాలు తయారు చేయించి అందజేసినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని సేవలందించిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను అభినందించారు. ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చిన్ని, ఏట ప్రతాప్, సుజిత్ పర్యవేక్షించారు.

విజయలక్ష్మి దంపతుల సేవాగుణం ఆదర్శనీయం



విజయలక్ష్మి దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, డాక్టర్ సీఎల్ వెంకట్రావు

చిన్నఅవుటపల్లి(గన్నవరం): మండలంలోని చిన అవుటపల్లిలో ఉన్న పుణ్య చారిటీస్ ఆశ్రమంలో సోమవారం చారిటీస్ చైర్‌పర్సన్ యలమంచిలి విజయలక్ష్మి పంచమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచిలి లక్ష్మణరావు, విజయలక్ష్మి దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, స్వచ్ఛాంధ్ర మిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజాభివృద్ధి, వృద్ధుల శ్రేయస్సును కాంక్షిస్తూ పుణ్య చారిటీస్‌ను స్థాపించిన లక్ష్మణరావు, విజయలక్ష్మి దంపతులు ఆదర్శనీయులని యార్లగడ్డ కొనియాడారు. వారి ఆశయాలను ముందుకు నడిపిస్తూ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జాస్తి విజయభూషణ్ కుమార్‌ను అభినందించారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, సీనియర్ సిటిజన్ సంఘ నాయకులు మోత్కూరి వెంకటేశ్వరరావు, వివిధ రంగాలకు చెందిన గూడపాటి తులసీమోహన్, ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, గుండపనేని ఉమావరప్రసాదరావు, వేములపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక సాయినగర్‌కు చెందిన లంకె వంశీకృష్ణ కార్పెంటర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనితో పాటు అతని తల్లి అరుణకుమారి ఉంటోంది. ఆమె ఆటోనగర్‌లో ఓ స్టీల్ కంపెనీలో పని చేస్తోంది. అరుణకుమారి ఈ నెల 14వ తేదీన ఉద్యోగానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడు వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూమి ప్రాతిపదికన అంచనాలు రూపొందించాలి

- ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలి
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



ఉంగుటూరులో బుడమేరు వరదకు మాడిపోయిన పంటను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉంగుటూరు: గ్రామాల ప్రాతిపదికన కాకుండా నష్టం జరిగిన భూమి ప్రాతిపదికగా ఎన్యూమరేషన్ చేసి రైతులకు నష్ట పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. మండలంలోని బుడమేరు ముంపు ప్రాంతాల్లో కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను భూమి ప్రాతిపదికన చేసి నివేదిక రూపొందించాలని కోరారు. ఎండకు ఎండిన పంటలను చూశాం కానీ వరద నీటిలో మునిగి మాడిపోవడం అనేది చరిత్రలో ఎన్నడూ చూడలేదని, ఇప్పుడు ఇక్కడే చూశామని అన్నారు. పంట నష్టం అనేది ఏరియా ప్రాతిపదికగా అంచనా వేస్తున్నారని తద్వారా పరిహార చెల్లింపులకు సన్నాహాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. నష్టపోయిన ప్రతి ఎకరా భూమి పరిశీలన చేసి పరిహారం అందించేలా ఎన్యూమరేషన్ చేయాలని అన్నారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు పరిహారం ఈ నష్టాన్ని ఏ విధంగాను తీర్చలేదని, కనుక ప్రతి ఎకరాకు రూ.25వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ స్థానికంగా నష్టపోయిన రైతు, కౌలు రైతులదని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.వి.లక్ష్మణస్వామి, జిల్లా కార్యదర్శి రంగారావు, బి.నాగేశ్వరరావు, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం పెంచి రైతులను అదుకోవాలి

గన్నవరం: బుడమేరు, ఏలూరు కాలువ ముంపు నష్టాన్ని సక్రమంగా ఎన్యూమరేషన్ చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10 వేలు నష్ట పరిహారాన్ని పెంచి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువకు పడిన గండిని, ముంపునకు గురైన పంట పొలాలను సోమవారం రైతు సంఘాల నాయకులు పరిశీలించారు. నియోజకవర్గంలోని బుడమేరు పరివాహక ప్రాంతాల్లో దెబ్బ తిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ...బుడమేరు ముంపుపై 1960 నుంచి ప్రభుత్వాలు మిత్రా, బుర్రా, శివరామకృష్ణ కమిటీలు వేసినప్పటికీ, ఆచరణలో ఆ కమిటీల నివేదికలను విస్మరించారని చెప్పారు. దీనివల్ల 20 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునే బుడమేరులోకి 48 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో విజయవాడ ముంపునకు గురైందన్నారు. దీనివల్ల లక్షలాది మంది నిరాశ్రయులు కావడంతో పాటు 5.67 లక్షల ఎకరాలు ముంపునకు గురైందన్నారు. వరద ముంపు వల్ల ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రైతులు నష్టపోయారని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఎకరానికి రూ.10 వేలు సాయం రైతులకు ఏమూలకూ సరిపోదని చెప్పారు. ఎన్యూమరేషన్‌లో వాస్తవ సాగుదారులను వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘాల నేతలు వి.కృష్ణయ్య, గొరిశెట్టి నాగేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, బేతా శ్రీనివాసరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కేవీ రెడ్డి సినీరంగ సేవలు ఆదర్శం



విజయవాడ కల్చరల్: నిర్మాత, దర్శకుడు కేవీ రెడ్డి (కదిరి వెంకటరెడ్డి) సినీరంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద కేవీ రెడ్డి 50 వర్ధంతి, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమాలను స్వర్ణయుగం వైపు మళ్లించిన దర్శకుడు కేవీ రెడ్డి అన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు సింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో క్లాసిక్‌గా భావించే మాయాబజార్ చిత్రం విడుదలై 67 సంవత్సరాలైనా నేటికి ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉన్నారన్నారు. వివిధ రంగాలకు చెందిన కే డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, గోళ్ల నారాయణరావు, బీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.